




గురువారం 9 జూలై 2026 పేజీలు : 8

# సింగరేణి హక్కుల పోరాటానికి ఫలితం

సింగరేణి సంస్థ హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని, తాడిచెర్ల కోల్ బ్లాక్--2ను సింగరేణికి కేటాయించడం తెలంగాణ ప్రజల విజయమని జి. వంశీ కృష్ణ గడ్డం అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని బుధవారం తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలోనే జి. వివేక్ వెంకటస్వామితో కలిసి సింగరేణికి జరుగుతున్న అన్యాయంపై గళం విప్పామని, సంస్థ ప్రయోజనాల కోసం పార్లమెంట్ లో పోరాడతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రావెల్లడి




నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), జిల్లా పంచాయతీ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశం

# కోల్ మైన్స్ PF ఖాతాదారులకు శుభవార్త!

2025--26 ఆర్థిక సంవత్సరానికి 7.6 శాతం వడ్డీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం







దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) సభ్యుల ఖాతాల్లో 7.6 శాతం వడ్డీ జమ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్‌వో) బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2026 జూన్ 30న జారీ చేసిన లేఖ (నం. 20030/2/2026–సీఎంపీఎఫ్) ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎంపీఎఫ్‌వో వెల్లడించింది. కమిషనర్ ఆమోదంతో రీజినల్ కమిషనర్--1 (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) నిరంజన్ కుమార్ మిశ్రా 2026 జూలై 8న సంబంధిత సర్క్యులర్‌ను విడుదల చేశారు.

# అరుదైన చికిత్సతో వృద్ధుడికి ప్రాణం పోసిన వైద్యులు

## ...మెదడు రక్తస్రావానికి శస్త్రచికిత్స లేకుండానే ఎంబోలైజేషన్‌తో చికిత్స

## ...యశోద ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్

**మంచిర్యాల ప్రతినిధి, జూలై 08, ప్రజా జ్యోతి:** తీవ్ర మెదడు రక్తస్రావంతో కోమాలోకి వెళ్లిన 70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు హైదరాబాద్ యశోద ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రముఖ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన కాసువార మల్లేష్ 2025 నవంబర్‌లో తీవ్ర తలనొప్పితో కుప్పకూలగా, మంచిర్యాలలోని మెడిలైఫ్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించగా, మొదట మెదడులో రక్తస్రావాన్ని నియంత్రించేందుకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాపాయస్థితి నుండి రక్షించగలిగాము, అనంతరం 2026 జనవరిలో మళ్లీ సమస్య తలెత్తడంతో శస్త్రచికిత్స చేయకుండా తొడలోని రక్తనాళం ద్వారా మిడిల్ మెనింజియల్ ఆర్టరీ ఎంబోలైజేషన్ అనే ఆధునిక చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆరు నెలలుగా మల్లేష్



ఆరోగ్యంగా ఉండటంతో ఆయన కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడిలైఫ్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కౌటం కుమారస్వామి, యశోద ఆసుపత్రి మేనేజర్ అంకం మల్లేష్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సుకు ఎంపికైన డిపిఆర్ఓ సంపత్ కుమార్‌కు ఘన సన్మానం

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో శాలువాతో సత్కారం --

## సేవలు అభినందనీయమని అబ్దుల్ రహమాన్ ప్రశంస

**ఆసిఫాబాద్, జూలై 8:ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్ జర్నలిస్టులకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయ మని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహ మాన్ కొనియాడారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి డిపిఆర్ఓ సంపత్ కుమార్ ఎంపికై హాజరైన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని డిపిఆర్ఓ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ, మారుమూల వెనుకబడిన జిల్లా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ సదస్సుకు సంపత్ కుమార్ ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం డిపిఆర్ఓ నిరంతరం కృషి చేస్తున్నారని, అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చొరవ చూపుతున్నారని



ప్రశంసించారు. ప్రభుత్వం, పాలకులు, జర్నలిస్టుల మధ్య వారధిగా వ్యవహరిస్తూ సమాచారాన్ని వేగంగా చేరవేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి దేవునూరి రమేష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, జిల్లా నాయకులు నగరారే తారు, సురేష్ చారి, రాధాకృష్ణ చారి, రాజు, జానకిరామ్, నితీష్, మోహన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బ్యాగుల పంపిణీ

**జన్నారం,జూలై8(ప్రజాజ్యోతి)**పూర్ణచందర్రావు(పీ.సీ.ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. అందులో భాగంగా మండలం లోని లింగయ్య పల్లె ప్రాథమిక పాఠశాల అంగన్వాడి విద్యార్థులకు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్ ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ.సీ.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి వనిత శ్రీనివాస్ ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్ కుమార్, బెడద గోపాల్, స్కూల్ ఉపాధ్యాయులు వామన్ కుమార్,



జ్యోతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు,పదవీ విరమణలు సహజమే.ఎంపీడీఓ ఉమర్ షరీఫ్.



**జన్నారం,జూలై8(ప్రజాజ్యోతి)**ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు సహజమేనని ఎంపీడీవో ఉమర్ షరీఫ్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రోజున ఇటీవల పదవి విరమణ పొందిన హౌసింగ్ ఏఈ లియాకత్ అలీ, బదిలీపై వెళు తున్న పంచాయతీ కార్యదర్శులకు, కొత్తగా వచ్చిన హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ కు, పంచాయతీ కార్యదర్శులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమర్ షరీఫ్ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన హౌసింగ్ ఏఈ లియాఖత్ అలీ ప్రతి అధికారితో సిబ్బందితో కలిసి మెలిసి ఉన్నారని ఆయన చేసిన సేవలను మరువలేమని అన్నారు. తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఏ ఈ లియాకత్ అలీ మాట్లాడుతూ ఉద్యోగ సమయంలో తనకు ప్రతి ఒక్క అధికారి, ప్రజలు సహక రించారని అన్నారు. వారికి ఋణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రవీందర్, ఎంపీఓ జలంధర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

# పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి: బిఎల్ఓ లకు తహసిల్దార్ సూచన



**సోనాల, జులై 08 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బి ఎల్ ఓల సమీక్ష సమావేశంలో కొన్ని సూచనలు చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకొండ క్షేత్రస్థాయిలో పక్కాగా సర్వే నిర్వహించాలని మరియు బిఎల్ఓ ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలని, మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మరియు శాశ్వతంగా వలస వెళ్లిన లేదా మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటి ప్రేమ్ నివాస్, ఆర్ ఐ సునీత మరియు బిఎల్ఓ లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

: గుర్నూలే నారాయణ

**ఆసిఫాబాద్ జులై 8 ప్రజా జ్యోతి** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నూలే నారాయణ అన్నారు. బుధవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుర్నూలే నారాయణ మాట్లాడుతూ సంక్షేమ పాలనతో సరికొత్త చరిత్ర సృష్టించిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాల ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారని తెలిపారు. పేదల కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా



నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మండోకర్ అనిల్, మండల ప్రచార కార్యదర్శి లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు చునర్కర్ శివాజీ, డా. చంద్రశేఖర్, సరండీ మాజీ సర్పంచ్ దుర్గం బాబురావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టాస్క్ శిక్షణతో ముగ్గురు యువతులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు



అభ్యర్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** జిల్లాలోని టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) కేంద్రం ద్వారా శిక్షణ పొందిన ముగ్గురు యువతులు టీసీఎస్ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపికై ఉద్యోగాలు సాధించారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యోగాలు సాధించిన జి. కావ్య, ఎం. అంజలి, కె. సాయివాణిలను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ సాంకేతిక కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ కేంద్రం కృషి చేస్తోందన్నారు. టాస్క్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి టీసీఎస్ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. టాస్క్ కేంద్రం అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత

**అనర్హులపై ఫిర్యాదులకు అవకాశం..**

**మోసగాళ్లను నమ్మొద్దని తహసిల్దార్ హెచ్చరిక.**

**మందమర్రి, జూలై 08(ప్రజాజ్యోతి ):** డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు మండల తహసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ తెలిపారు. సొంత ఇల్లు లేని అర్హులైన పేద కుటుంబాలనే లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇళ్ల కేటాయింపులో ఎవరైనా అనర్హులు చోటు చేసుకున్నట్లు సమాచారం ఉంటే సంబంధిత ఆధారాలతో మండల తహసిల్దార్ కార్యాలయం




లేదా మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించి, అనర్హులుగా తేలిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పిస్తామని చెప్పి కొందరు ప్రజలను మోసగించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని తహసిల్దార్ హెచ్చరించారు. అలాంటి వారి మాటలను నమ్మి ఎవరికీ డబ్బులు చెల్లించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇళ్ల కేటాయింపుపై సందేహాలు లేదా అభ్యంతరాలు ఉన్న వారు నేరుగా తహసిల్దార్ కార్యాలయం లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి తమ ఫిర్యాదులు, దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

## తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ కేటాయింపుపై కేంద్రానికి బీఎంఎస్ కృతజ్ఞతలు

ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం





**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి హెడ్ ఆఫీస్ ప్రధాన ద్వారం వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు అండ్ గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. సంఘం కార్పొరేట్ ఉపాధ్యక్షుడు రామ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని సింగరేణి అధికారుల సంఘం కార్పొరేట్ ఏరియా అధ్యక్షుడు, జనరల్ మేనేజర్ (ఎడ్యుకేషన్) వెంకటాచారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీఎంఎస్ నాయకులు, బీజేపీ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ఆనందోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పి. మాధవ నాయక్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి లు మాట్లాడుతూ, గత రెండేళ్లుగా తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని బీఎంఎస్ తరపున కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. ఇటీవల కూడా యూనియన్ ప్రతినిధులు నేరుగా కలిసి ఈ గని సింగరేణికి ఎంత అవసరమో వివరించగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ నిర్ణయం బీఎంఎస్ పోరాటానికి లభించిన విజయమని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రికి, కేంద్ర మంత్రికి సింగరేణి కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. జియోలాజికల్ ఎక్స్‌ప్లోరేషన్ నివేదిక ప్రకారం తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌లో సుమారు 277 మిలియన్ టన్నుల జి–8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, అందులో సుమారు 182 మిలియన్ టన్నుల వరకు తవ్వకాలు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఈ గని సింగరేణి భవిష్యత్తుకు, కార్మికుల ఉద్యోగ భద్రతకు, సంస్థ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో ఆర్థిక సంక్షోభంలో ఉన్న సింగరేణిని ఆదుకునేందుకు తీసుకున్న నిర్ణయాలను గుర్తు చేస్తూ, ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, వివిధ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం నిరంతరం పోరాడుతూ ఫలితాలు సాధిస్తున్న కార్మిక సంఘం బీఎంఎస్ మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని కొత్త బొగ్గు గనులు, ఉపాధి అవకాశాలు, సంస్థ విస్తరణ కోసం కార్మికులందరూ బీఎంఎస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీ కృష్ణారెడ్డి, టి.ఎస్. పవన్ కుమార్, మొగిలి పాక రవి, ఉదయ్ భాస్కర్, నరేష్ హరీష్, జగన్మోహన్, సంగం చందర్, మారేపల్లి శ్రీనివాస్, బాలకృష్ణ, రాగూర్ నిర్మల, ఇనుపనూరి నాగేశ్వరరావు, రాకేష్‌తో పాటు బీజేపీ, బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుండి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

**లేకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం: డీవైఎఫ్ఐ హెచ్చరిక**

**ఆసిఫాబాద్, జూలై 8 ప్రజా జ్యోతి** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని గుండి గ్రామం వద్ద వాగుపై నిర్మిస్తున్న హై లెవల్ వంతెన పనులను తక్షణమే పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. బుధవారం గుండి వంతెనను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 2007లో నాబార్డ్ నిధులతో ప్రారంభమైన ఈ వంతెన నిర్మాణం 2010లో పూర్తికావాల్సి ఉన్నప్పటికీ, 2026 నాటికీ అసంపూర్తిగా ఉండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.మొదట రూ.8.50 కోట్లతో అంచనా వేసిన వ్యయం, పనుల జాప్యం కారణంగా రూ.14.40 కోట్లకు పెరిగిందని, ఇప్పటివరకు కేవలం 11 పిల్లర్లు మాత్రమే నిర్మించారని తెలిపారు. ఈ ఆలస్యం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు.గుండి వాగుపై శాశ్వత వంతెన లేకపోవడంతో సుమారు 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలంలో గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల ప్రయాణాలు, నిత్యావసర అవసరాలన్నీ తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు నాటు పడవలు, థర్మాకోల్ తెప్పలపై ప్రాణాలను పణంగా పెట్టి వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొందని



ఆవేదన వ్యక్తం చేశారు.గత రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు వంతెన నిర్మాణంపై హామీలు ఇస్తున్నప్పటికీ అవి అమలుకు నోచుకోలేదని కార్తీక్ ఆరోపించారు. ఇకనైనా వంతెన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, లేకపోతే 15 గ్రామాల ప్రజలను సమీకరించి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేసే ప్రజాప్రతినిధులకు రాజకీయంగా తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, గ్రామ నాయకులు రాహుల్, శంకర్, దిలీప్, సావిత్రి, సోనీ, హారిక, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డీజీఎంఎస్ బృందం శ్రీరాంపూర్ ఏరియాలో విస్తృత తనిఖీలు





## నేడు 24వ ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం

**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో గనుల భద్రతా ప్రమాణాల పరిశీలనలో భాగంగా డీజీఎంఎస్ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) సభ్యుల బృందం బుధవారం పర్యటించింది. గురువారం జరగనున్న 24వ ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు శ్రీరాంపూర్‌కు చేరుకున్న డీజీఎంఎస్ అధికారులకు ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్ ఘనంగా స్వాగతం పలికారు. శ్రీరాంపూర్ ఏరియా గెస్ట్ హౌస్‌లో గురువారం నిర్వహించనున్న త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశంలో డీజీఎంఎస్ అధికారులు, యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని గనుల భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. పర్యటనలో భాగంగా డీఎంఎస్ (మైనింగ్) సాగేష్ కుమార్, డీడీఎంఎస్ (మైనింగ్) దీపక్ కుమార్‌లు ఎస్ఆర్పీ-3 భూగర్భ గనిని సందర్శించారు. ఇటీవల గనిలో జరిగిన ప్రమాదాల వివరాలను గని మేనేజర్‌ను అడిగి తెలుసుకుని, ప్రమాదాల కారణాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టిన నివారణ చర్యలను సమగ్రంగా సమీక్షించారు. అనంతరం గని మ్యాప్‌ను సర్వేయర్, గ్రూప్ ఏజెంట్‌తో కలిసి పరిశీలించి, ప్రస్తుతం కొనసాగుతున్న పనిప్రదేశాలు, అనుమతులు, భద్రతా ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. తర్వాత ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్‌లతో కలిసి అధికారులు గని లోపలకు వెళ్లి 5 సీమ్‌లోని ఎస్ఎస్-4 ప్యానల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అధికారులకు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచనలు చేశారు. మరోవైపు డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి ఎస్ఆర్పీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును సందర్శించి సబ్‌స్టేషన్‌లు, బేస్ వర్క్‌షాప్‌లు, ఆఫ్‌లోడింగ్ సబ్‌స్టేషన్, వర్క్‌షాపులలో విద్యుత్ భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ పర్యటనలో ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్, ఏఎస్ఓ విజయ్ కుమార్, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ వెంకట్ రావు, రక్షణ అధికారి మహేందర్, సర్వేయర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్డు బ్యాలెన్స్ వివరాలు ఇకపై మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** సిపిఆర్ఎంఎస్ (ఎన్.ఈ.) మెడికల్ సింగరేణి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా సిపిఆర్ఎంఎస్ (ఎన్.ఈ.) మెడికల్ కార్డులో అందుబాటులో ఉన్న బ్యాలెన్స్ వివరాలను ఇకపై రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ (టెక్స్ట్ మెసేజ్) రూపంలో పంపిస్తున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు. ఈ సౌకర్యం ద్వారా సభ్యులు తమ మెడికల్ కార్డులో మిగిలి ఉన్న బ్యాలెన్స్‌ను ఎప్పటికప్పుడు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల సభ్యులందరూ తమ రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లను క్రమం తప్పకుండా పరిశీలించి, అందులో పేర్కొన్న బ్యాలెన్స్ వివరాలను గమనించాలని సూచించారు. రిజిస్టర్ చేసిన మొబైల్ నంబర్ మారినట్లయితే లేదా ఎస్ఎంఎస్ అందకపోతే సంబంధిత సింగరేణి అధికారులను సంప్రదించి మొబైల్ నంబర్‌ను వెంటనే నవీకరించుకోవాలని కోరారు. ఈ సదుపాయాన్ని ప్రతి సభ్యుడు సద్వినియోగం చేసుకుని మెడికల్ కార్డు బ్యాలెన్స్ వివరాలను సులభంగా తెలుసుకోవాలని ఆళవందార్ వేణు మాధవ్ విజ్ఞప్తి చేశారు.

## రీజినల్ మేనేజర్‌కు ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సన్మానం

**ఉద్యోగుల సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారంపై వినతి**




**ఆసిఫాబాద్, జూలై 8 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఆసిఫాబాద్ డిపోలో ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రీజినల్ మేనేజర్ ఆర్యంను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యదర్శి జాడి లక్ష్మణ్, డిపో కోశాధికారి ముకుందరావు మాట్లాడుతూ ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, డిపో అభివృద్ధి, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. డిపోలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రీజినల్ మేనేజర్‌ను కోరారు. దీనికి స్పందించిన రీజినల్ మేనేజర్ ఆర్యం, అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను సానుకూలంగా పరిశీలించి, ఉద్యోగుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ/ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు జాదవ్ సాంబశివరావు, డిపో మేనేజర్, అసిస్టెంట్ డిపో మేనేజర్, డిపో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎం సహాయనిధి

– ఆదే గజేందర్

**--రూ! 5,69 500 లక్షల సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ**



**నేరడిగొండ, జూలై 08( ప్రజాజ్యోతి):**పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదే గజేందర్ అన్నారు. బుధవారం నేరేడిగొండ మండల కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదే గజేందర్ మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో తాము నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. 12 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయంఈ కార్యక్రమంలో మొత్తం 12 మంది లబ్ధిదారులకు రూ. 5,69,500 విలువైన చెక్కులను ఆదే గజేందర్ అందజేశారు. లబ్ధిదారుని పేరు మంజూరైన మొత్తం (రూ.) ఫాతిమా బేగం 1,20,000 జగదీష్ 80,000,శంకర్ బండారి 60,000,రాహుల్ 60,000,ఆర్మూర్ దీపక్ 45,000,నారాయణ ఆడెపు 42,500 గిమ్మేకర్ శ్రీనివాస్ 40,000,అంగ అరుణ్ 37,500,కోదాటి స్వర్ణలత 36,000, సమ్రీన్ తబస్సుం 20,500,కటారే ధనరాజ్ 18,000, రవి తేజ 10,000,కష్టకాలంలో తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ తీసుకున్న నియోజకవర్గ ఇంచార్జ్ ఆదే గజేందర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయి

ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింజుపల్లి నర్సింగ్



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను భారీగా దోపిడీ చేస్తున్నాయని ఎస్సీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింజుపల్లి నర్సింగ్ ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ, ప్రభుత్వ విద్యాసంస్థలపై దుష్ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మోసపూరిత హామీలతో ఆకర్షించి, అనంతరం అడ్మిషన్ ఫీజు, టర్మ్ ఫీజు, యూనిఫాం, టై, బెల్ట్, షూస్, పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బస్సు తదితర పేర్లతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా కార్పొరేట్ విద్యాసంస్థల ఒత్తిళ్లు, ముడుపులకు లోబడి ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. కనీస మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ అనుమతులకు అవసరమైన ప్రమాణాలు లేకుండానే అనేక పాఠశాలలు నడుస్తున్నాయని అన్నారు. విద్యార్థులు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర సామగ్రి బయట కొనుగోలు చేయకుండా పాఠశాలల ద్వారానే కొనాలని బలవంతం చేస్తున్నారని, మార్కెట్‌లో రూ.40కు లభించే నోట్ బుక్‌ను రూ.100 నుంచి రూ.110 వరకు విక్రయిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. స్థానిక బుక్‌స్టాల్‌లతో కుమ్మక్కై కమిషన్‌ల పేరుతో దోపిడీ కొనసాగుతోందని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ చాలా ప్రైవేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని నర్సింగ్ అన్నారు. ప్రతి పాఠశాలకు తప్పనిసరిగా ఉండాల్సిన ఆట స్థలం, అగ్నిమాపక భద్రతా సర్టిఫికెట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు వంటి ప్రాథమిక సదుపాయాలు చాలా చోట్ల కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించే విద్యాసంస్థలు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారని, ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు వెచ్చించి అందిస్తున్న ప్రభుత్వ విద్యను పరోక్షంగా బలహీనపరుస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాసంస్థలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, వసతి గృహాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతో పాటు బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్ వరకు పౌష్టికాహారం అందిస్తోందని గుర్తు చేశారు. అదేవిధంగా అన్ని వర్గాల విద్యార్థులు కలిసి చదివేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రభుత్వం ప్రారంభించడం అభినందనీయ మని అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివించేలా చట్టం తీసుకురావాలని ఆయన సూచించారు. అటెండర్ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు, వార్డు సభ్యుడు నుంచి ముఖ్యమంత్రి వరకు అందరికీ ఈ నిబంధన వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ డిమాండ్‌పై రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని ఎస్సీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింజుపల్లి నర్సింగ్ తెలిపారు.

# విజిలెన్స్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి

**సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న జాదవ్**

**విజిలెన్స్ వ్యవస్థ బలోపేతానికి సింగరేణి కోల్ ఇండియా సంయుక్త అవగాహన కార్యక్రమం**



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** విజిలెన్స్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న జాదవ్ తెలిపారు. సింగరేణి సంస్థలో విజిలెన్స్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు పారదర్శకత, జవాబుదారీతనం, ఉత్తమ పరిపాలనా విధానాలను ప్రోత్సహించే లక్ష్యంతో సింగరేణి సంస్థ విజిలెన్స్ విభాగం, కోల్ ఇండియా లిమిటెడ్ విజిలెన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరస్పర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరు సంస్థల విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొని విజిలెన్స్ రంగంలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి. వెంకన్న జాదవ్, ఐఆర్‌టీఎస్ అధ్యక్షత వహించారు. సంస్థలో విజిలెన్స్ వ్యవస్థను నిరంతరం బలోపేతం చేయడంతో పాటు నూతన ఆలోచనలు, ఆధునిక విధానాలను అమలు చేయడం, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడం కాలానుగుణ అవసరమని ఆయన పేర్కొన్నారు. విజిలెన్స్ వ్యవస్థ కేవలం అవినీతి నిరోధానికే పరిమితం కాకుండా, సుస్థిరమైన పరిపాలనకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కోల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బ్రజేష్ కుమార్ త్రిపాఠి, ఐఆర్ఎస్ఈ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న ఆధునిక విజిలెన్స్ విధానాలు, నివారణాత్మక విజిలెన్స్ చర్యలు, పారదర్శకత పెంపునకు చేపడుతున్న చర్యలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, అవినీతి నిరోధక వ్యవస్థలు, అంతర్గత పర్యవేక్షణ విధానాలు, ఉత్తమ పరిపాలనా పద్ధతులపై ఆయన సమగ్రంగా వివరించారు. విజిలెన్స్ వ్యవస్థలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా అవకతవకలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని, బాధ్యతాయుతమైన పాలనను బలోపేతం చేయవచ్చని తెలిపారు. సింగరేణి విజిలెన్స్ అధికారులు కోల్ ఇండియా అమలు చేస్తున్న విధానాలపై పలు సందేహాలను నివృత్తి చేసుకోగా, ఇరు సంస్థల అధికారులు పరస్పరం తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సింగరేణి, కోల్ ఇండియా విజిలెన్స్ విభాగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావడంతో పాటు ఉత్తమ విధానాల పరస్పర మార్పిడికి వేదిక ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బి. వెంకన్న జాదవ్ మాట్లాడుతూ, సంస్థలో నిజాయితీ, జవాబుదారీతనం, నైతిక విలువలను పెంపొందించడంలో విజిలెన్స్ విభాగం నిరంతరం కృషి చేస్తోందని, ఆధునిక అవసరాలకు అనుగుణంగా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ఈ అవగాహన సమావేశం విజిలెన్స్ వ్యవస్థలో నూతన ఆలోచనలకు, పరస్పర అనుభవాల మార్పిడికి, సమర్థవంతమైన పరిపాలనకు దోహదపడిందని అభిప్రాయపడ్డారు. సింగరేణిలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పరిపాలన లక్ష్యాల సాధనలో ఈ కార్యక్రమం మరో కీలక ముందడుగుగా నిలిచిందని అన్నారు.

# మంచిర్యాల మండల మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకుడు బేర సత్యనారాయణ ఇంటిపై దాడి

**ఖండించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగ్పూరి వెంకటేశ్వర్ గౌడ్**



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మండల మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకుడు బేర సత్యనారాయణ నివాసంపై జరిగిన దాడిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగ్పూరి వెంకటేశ్వర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్ అనుచరులు బేర సత్యనారాయణ ఇంటిపై దాడి చేసి, ఇంటి అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు తలుపులను బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ బెదిరించి ఇంటి వద్ద భయానక వాతావరణం సృష్టించడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమేనని, అయితే వాటిని చర్చలు, విమర్శలు, ప్రెస్‌మీట్లు వంటి ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే వ్యక్తపరచాలని అన్నారు. రౌడీయిజం, వ్యక్తిగత దాడులు, బెదిరింపుల సంస్కృతికి ప్రజాస్వామ్యంలో ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. గతంలో కూడా మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్‌పై పలు ఆరోపణలు వచ్చాయని, అనేక మందిపై దాడులకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. మేయర్ అవినీతి, అక్రమాలను బేర సత్యనారాయణ ప్రజల ముందుకు తీసుకురావడం, ప్రశ్నించడం వల్లే కక్షసాధింపు ధోరణితో ఈ దాడి జరిగిందని ఆరోపించారు. బేర సత్యనారాయణ కుటుంబ సభ్యుల ప్రాణాలకు తగిన భద్రత కల్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, పోలీసు శాఖను నగ్పూరి వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అమరశెట్టి రాజు, కౌన్సిలర్లు బోట్ల సత్యనారాయణ, అనిత, నాగరాజు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల అశోక్ వర్ధన్, సదానందం, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ రావు, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పానుగంటి మధు, బీజేపీ రాష్ట్ర కార్యకర్త దుర్గం అశోక్, మాజీ ఎంపీటీసీ మోటపలుకుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పే అప్‌గ్రేడేషన్, పీఆర్పీ అమలే ధ్యేయం

**పదో రోజూ కొనసాగిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్ష**



**జైపూర్, జూలై 8 (ప్రజా జ్యోతి)** జైపూర్ సింగరేణి అధికారులకు పే అప్‌గ్రేడేషన్ పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం (పీఆర్పీ) తో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం పదో రోజుకు చేరుకుంది.సీఎంఓఏఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 29 నుంచి జూలై 13 వరకు చేపట్టిన దీక్షలో భాగంగా జైపూర్ మండలంలోని సింగరేణి విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో పదో రోజు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. దీక్షలో కె.వి. శ్రీనివాసరావు (ఎస్ఈ--ఈఅండ్ఎం)బి క్రాంతి కుమార్ (ఎస్ఈ--ఈఅండ్ఎం) కె అరుణ్ (ఈఈ--ఈఅండ్ఎం) పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, పే అప్‌గ్రేడేషన్, పీఆర్పీ అమలుతో పాటు అధికారులకు సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పదో రోజూ ఉద్యమం ఉత్సాహంగా కొనసాగడం అధికారుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ ఎస్టీపీపీ పీ శాఖ నాయకులు, అధికారులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తమ ఉద్యమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సింగరేణికి తాడిచెర్ల--2 కోల్ బ్లాక్ కేటాయింపు బీజేపీ విజయం

**బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** తాడిచెర్ల--2 కోల్ బ్లాక్‌ను ఎలాంటి బిడ్డింగ్ ప్రక్రియ లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించడం ద్వారా సంస్థకు సుమారు రూ.2,550 కోట్ల ప్రత్యక్ష లాభం చేకూరిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. తాడిచెర్ల--2 కోల్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయిస్తూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా బుధవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియ లోని శ్రీరాంపూర్--3 గని వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, టపాసులు పేల్చి బీజేపీ నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు సింగరేణికి రావాల్సిన రూ.52 వేల కోట్ల బకాయిలు విడుదల చేయకుండా సంస్థ మనుగడను ప్రశ్నార్థకంగా మార్చాయని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం సింగరేణికి గొప్ప ఊరటనిచ్చిందని అన్నారు. తాడిచెర్ల--2 కోల్ బ్లాక్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ గని ద్వారా 50 నుంచి 60 సంవత్సరాల పాటు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. ఈ బ్లాక్ ద్వారా సింగరేణికి సుమారు రూ.60 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని, ప్రత్యక్షంగా 1,200 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సింగరేణి కార్మికుల తరఫున బీజేపీ జిల్లా శాఖ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జోన్ అధ్యక్షుడు సత్రం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ రావు, కార్మిక సెల్ నాయకులు గోళ్ళ మహేందర్ వర్మ, గడిగొప్పుల సురేందర్, గోదాసు భీమన్న, శ్రీరాంపూర్ జోన్ ప్రధాన కార్యదర్శి పున్నమైన సదానందం, కొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

**అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అండ్ జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తరగతి గదిలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేలా బోధన సాగించాలని కోరారు. కొత్త విషయాలు, ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, సెక్టోరియల్ అధికారులు భరత్ కుమార్, కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, రిసోర్స్ పర్సన్స్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వనమహోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్**

బెల్లంపల్లి మండలంలోని బుద్ధకాలన్ గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసి, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. గ్రామాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ఘన, ద్రవ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు గ్రామపంచాయతీలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వనమహోత్సవం లక్ష్యాలను శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎన్. కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, పంచాయతీరాజ్ డి.ఈ.ఈ. రవీందర్, గ్రామ సర్పంచ్ దాడి నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

**భీమిని మండలంలో అభివృద్ధి పనుల పరిశీలన**

భీమిని మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటిన అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, భావితరాలకు సమతుల్య పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం వడల, జగ్గయ్యపేట గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియతో పాటు అభివృద్ధి పనులను పరిశీలించి, నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేస్లాపూర్ గ్రామపంచాయతీలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ కేస్లాపూర్--గట్టుపల్లి పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గోదావరిఖని సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్‌కు వినతి

**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్మెంట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) ప్రాంతీయ కమిషనర్ కార్యాలయంలో ప్రాంతీయ కమిషనర్ డా. గోవర్ధన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్‌తో పాటు సింగరేణి ఇతర ఏరియాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రతి నెలా 1 న వివిధ బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన బొగ్గు పెన్షన్‌దారు లందరి ఖాతాల్లో పెన్షన్ జమయ్యేలా సీఎంపీఎఫ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల ఎస్‌బీఐ ఖాతాదారులకు 1వ తేదీకి బదులుగా 3వ తేదీన పెన్షన్ జమ కావడంతో అతి తక్కువ పెన్షన్‌పై ఆధారపడుతున్న వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు నిత్యావసర ఖర్చులు, మందుల కొనుగోలు వంటి అవసరాల కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వినతిపత్రంలో తెలిపారు . అదేవిధంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు ఇప్పటికీ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీ.పీ.ఓ.) కాపీలు అందలేదని, పీ.పీ.ఓ. అందని ప్రతి పెన్షనర్‌కు వెంటనే వాటిని అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పదవీ విరమణ చేసిన సింగరేణి ఉద్యోగుల సీఎంపీఎఫ్‌కు సంబంధించిన క్లెయిమ్‌లను జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించి, విశ్రాంత ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం సమర్పించిన వినతిపత్రంపై ప్రాంతీయ కమిషనర్ డా. గోవర్ధన్ సానుకూలంగా స్పందించారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, పెన్షన్ జమలో జాప్యం, పీ.పీ.ఓ.ల పంపిణీ, పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారం వంటి అంశాలపై అవసరమైన చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఏ. గంగయ్యతో పాటు బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాలకు చెందిన సంఘం నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



# సింగరేణి హక్కుల పోరాటానికి ఫలితం

తాడిచెర్ల కోల్ బ్లాక్--2 కేటాయింపు

ఎంపీ గడ్డం వంశీకృష్ణ హర్షం

**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని, తాడిచెర్ల కోల్ బ్లాక్--2ను సింగరేణికి కేటాయించడం తెలంగాణ ప్రజల విజయమని జి. వంశీ కృష్ణ గడ్డం అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని బుధవారం తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలోనే జి. వివేక్ వెంకటస్వామితో కలిసి సింగరేణికి జరుగుతున్న అన్యాయంపై గళం విప్పామని, సంస్థ ప్రయోజనాల కోసం పార్లమెంట్ లో పోరాడతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ హామీకి అనుగుణంగా గత రెండేళ్లుగా సింగరేణికి హక్కుగా రావాల్సిన కోల్ బ్లాక్‌ల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చామని తెలిపారు. ఈ క్రమంలో జి. కిషన్ రెడ్డిని పలుమార్లు కలిసి తాడిచెర్ల కోల్ బ్లాక్--2ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశామని, ఇదే అంశంపై పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తి సింగరేణి కార్మికుల గొంతుకగా నిలిచామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల కోల్ బ్లాక్--2ను సింగరేణికి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎంపీ వంశీకృష్ణ గడ్డం, ఇది సింగరేణి సంస్థతో పాటు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కూడా కీలక నిర్ణయమని అన్నారు. ఈ కేటాయింపుతో సింగరేణి మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇది కేవలం కోల్ బ్లాక్ కేటాయింపు మాత్రమే కాదు.. సింగరేణి కార్మికుల పోరాటానికి దక్కిన విజయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవం. సింగరేణి హక్కులు, కార్మికుల సంక్షేమం కోసం మా పోరాటం భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో కొనసాగుతుంది" అని ఎంపీ వంశీకృష్ణ గడ్డం స్పష్టం చేశారు.



## ఈదులవాడ గ్రామంలో బోరు మరమ్మతులు పూర్తి నీటి సరఫరా పునరుద్ధరణ



**ఆసిఫాబాద్, జూలై 8 ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని నీతెను గూడ గ్రామంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని బోరు మరమ్మతు పనులను చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం బోరు ద్వారా నీటి సరఫ రాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్యాణ్ సతీష్, గ్రామ కార్యదర్శి స్వప్న పాల్గొని పనులను పరిశీలించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిట్ట సత్యనారాయణ, ఇగురపు సంతోష్, సతీష్, రవి, సురేష్, వేంకటేశం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు బోరు మరమ్మతులు త్వరి తగతిన పూర్తి చేయించినందుకు గ్రామపంచాయతీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే మూడో కన్ను

వ్యాపారుల భద్రత కోసం దుకాణాల వద్ద నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఐ రమేష్ సూచన..



**మందమర్రి, జూలై 08( ప్రజాజ్యోతి ):** పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో వ్యాపారుల భాగస్వా మ్యం ఎంతో కీలకమని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. బుధవారం సాయంత్రం సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వ ర్యంలో రహదారి పక్కన వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణ దారులు, వ్యాపారులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ప్రతి వ్యాపారి తమ దుకా ణం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కెమెరాల ఉనికి వల్ల దొంగతనాలు, ఇతర అసాం ఘిక చర్యలకు పాల్పడే వ్యక్తుల్లో భయం ఏర్పడి నేరాలు తగ్గుము ఖం పడతాయని పేర్కొన్నారు. ఏదైనా ఘటన చోటుచేసుకున్నప్పు డు నిందితులను వేగంగా గుర్తించి కేసుల దర్యాప్తు పూర్తి చేయడంలో సీసీ కెమెరాల దృశ్యాలు పోలీసులకు ఎంతో కీలక ఆధారాలుగా నిలుస్తాయని వివరించారు. అందుకే సీసీ కెమెరాల ను ఒకటి దుకాణం లోపలి భాగాన్ని, మరొకటి బయట రహదా రిపై సంచరించే వ్యక్తులు, వాహనాలు స్పష్టంగా కనిపించేలా అమర్చాలని వ్యాపారులకు సూచించారు. సమావేశంలో పోలీసు సిబ్బందితో పాటు స్థానిక వ్యాపారులు, వ్యాపార సంఘాల ప్రతిని ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా త్వరలోనే దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని వ్యాపారులు పోలీసులకు హామీ ఇచ్చా రు. పట్టణ భద్రతకు ప్రతి వ్యాపారి సహకరించాలని, అనుమా నాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ షాక్ తో కేబుల్ ఆపరేటర్ మృతి



జన్నారం,జూలై8 (ప్రజాజ్యోతి) విద్యుత్ షాక్ తో కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన ఘటన మండలం లో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్ గ్రామాల వద్ద డిష్ కేబుల్ కు సంబంధించిన వైర్ కింద పడటంతో దానిని సరి చేయడానికి వచ్చిన దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య(43) వాటిని సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ పోల్ వద్ద కేబుల్ లాగుతుండగా 11 కెవి విద్యుత్ తీగల కు తగలడంతో విద్యుత్ షాక్ కు గురయ్యాడు. సమీపంలోని పొలాల దగ్గర ఉన్న స్థానికులు ఆయనను చూసి వాహనంలో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.మృతుడికి భార్య పద్మ, కూతుర్లు అంజలి అంజన,కుమారుడు రాజ్ కుమార్‌లు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ సోనాలలోనే ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పణ



సోనాల, జూలై 8 (ప్రజాజ్యోతి ):సోనాల మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం రాజ్యసభ సభ్యులు వేమ్ నరేందర్ రెడ్డిని కలిసిన తుల అరుణ్ కుమార్. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని సోనాల మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ టి పి ఎస్ (బ్రా) ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు తుల అరుణ్ కుమార్ ఈరోజు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, గౌరవ రాజ్యసభ సభ్యులు శ్రీ వేమ్ నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా తుల అరుణ్ కుమార్ మాట్లాడుతూ, బోథ్ నియోజకవర్గంలోని పది మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేని ఏకైక మండలం సోనాల అని వివరించారు. దీంతో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు, ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మరియు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అందువల్ల ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య అందించే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సోనాల మండలంలో ఏర్పాటు చేయడం అత్యవసరం అని రాజ్యసభ సభ్యులకు వివరించారు. వినతిని సానుకూలంగా స్వీకరించిన శ్రీ వేమ్ నరేందర్ రెడ్డి గారు, తన సమక్షంలోనే రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి యోగితా రాణా గారికి ఫోన్ చేసి ఈ ప్రతిపాదనను ప్రత్యేకంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, తుల అరుణ్ కుమార్ సమర్పించిన వినతి పత్రంపై తన ఆమోద సంతకం చేసి సంబంధిత అధికారులకు పంపించారు. సోనాల మండల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సానుకూలంగా స్పందించిన రాజ్యసభ సభ్యులు శ్రీ వేమ్ నరేందర్ రెడ్డి గారికి, అలాగే వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించిన విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి యోగితా రాణా గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేట్ విద్యాసంస్థలను బ్యాన్ చేయాలి

**జూలై 10 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి**

**నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ జాబు**



**ఆశిష్ కుమార్ మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలను నిషేధించాలని, విద్యాహక్కు, ఫీజు నియంత్రణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్ పిలుపునిచ్చారు. మంచిర్యాల పట్టణంలో విద్యార్థులు, నాయకుల సమక్షంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జాబు ఆశిష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలైన ఎస్ఆర్, శ్రీ చైతన్య, నారాయణ అల్ఫోర్స్ తదితర సంస్థలు అధిక ఫీజులతో తల్లిదండ్రులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశారని విమర్శించారు. కార్పొరేట్ విద్యా వ్యవస్థ విద్యారంగానికి తీవ్రమైన ముప్పుగా మారిందని, ప్రభుత్వం వెంటనే కార్పొరేట్ విద్యాసంస్థలను బ్యాన్ చేసి విద్యాహక్కు, ఫీజు నియంత్రణ చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూలై 10న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంపూర్ణంగా పాల్గొని మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఆదిత్య, విఘ్నేష్, మణితేజ్, జామీర్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**నాణ్యమైన విద్యకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అవసరం: అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**



**ఆసిఫాబాద్, జూలై 8 ప్రజా జ్యోతి** ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, ఇంగ్లీష్, హిందీ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆధునిక బోధన పద్ధతులు అలవర్చుకోవాలని సూచించారు. ఐసీటీ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై అవగాహన పెంచుకుని వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా ఉపయోగించాలని అన్నారు. రేపటి తరం విద్యార్థులను తీర్చిదిద్దాలంటే ముందుగా ఉపాధ్యాయులే సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం సాధించాలని పేర్కొన్నారు.వర్క్‌బుక్‌లను సమర్థంగా వినియోగిస్తూ, ప్రతి విద్యార్థికి డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగం, విద్యార్థులతో ప్రయోగాలు చేయించడం, కృత్యాధారిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి హోలిస్టిక్ విద్యా విధానాన్ని అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి ఉమబాల, జిల్లా స్థాయి శిక్షకులు దూడ రాజనర్సుబాబు, శ్రీనాథ్, రాయిస్ అహ్మద్, సమ్మయ్యతో పాటు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

**జూలై 20లోపు అమర్చాలని అదనపు కలెక్టర్ వి. రాములు ఆదేశం**



**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):**వరి ధాన్యం, గన్నీ సంచుల రవాణా చేసే అన్ని వాహనాలకు జీపీఎస్ (వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్) తప్పనిసరిగా అమర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి ధాన్యం, గన్నీ సంచుల రవాణా వాహనాల గుత్తేదారులతో వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టంపై సమీక్ష సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం రవాణాలో పారదర్శకత, పర్యవేక్షణను మెరుగుపరచేందుకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను తప్పనిసరిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం, గన్నీ సంచులు రవాణా చేసే అన్ని వాహనాలకు ఈ నెల 20వ తేదీలోపు జీపీఎస్ పరికరాలను అమర్చాలని గుత్తేదారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, రవాణా గుత్తేదారులు పాల్గొన్నారు.

# ఘనంగా డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైఎస్సార్ సర్పంచ్ కూనేరు భూమన్న

**సారంగాపూర్, జులై 08,ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కునేరు భూమన్న వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన పథకాలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడిగా ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.వైఎస్సార్ చూపిన సంక్షేమ పాలన స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తోందని



చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ సభ్యులు దొడ నర్సయ్య, దేవి సుధాకర్,నాయకులు మల్లేష్ యాదవ్, గుంటుకు నవీన్, గుంజి సాయి కుమార్, విశాల్, బింగి రాజన్న,లక్ష్మ రెడ్డి,తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి





### చించోలి(బి) గ్రామస్తులతో సీఐ నిర్మల్ రూరల్ సమావేశం

### వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన పోలీసులు

**సారంగాపూర్, జులై 08,ప్రజా జ్యోతి** చించోలి(బి) గ్రామంలో నిర్మల్ రూరల్ సీఐ యం. కృష్ణ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భద్రత కోసం సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి దుకాణం వ్యాపారస్తులు వారి వారి సముదాయలకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వెంటనే గ్రామ సర్పంచ్ సాయన్న, గ్రామ అభివృద్ధి కమిటీ సీసీ కెమెరాలను తొందరలోనే ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు.అనంతరం వనమహోత్సవం లో భాగంగా గ్రామస్థులతో కలిసి అరె మైసమ్మ దేవాలయం వద్ద మొక్కలు నాటినారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ ఏసై శ్రీకాంత్ చించోలి(బి) గ్రామ సర్పంచ్ సాయన్న, ఉప సర్పంచ్ పోశెట్టి, పంచాయితీ సెక్రటరీ సౌజన్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### 2025--26 ఆర్థిక సంవత్సరానికి 7.6 శాతం వడ్డీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం

**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) సభ్యుల ఖాతాల్లో 7.6 శాతం వడ్డీ జమ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్‌వో) బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2026 జూన్ 30న జారీ చేసిన లేఖ (నం. 20030/2/2026-సీఎంపీఎఫ్) ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎంపీఎఫ్‌వో వెల్లడించింది. కమిషనర్ ఆమోదంతో రీజినల్ కమిషనర్--1 (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) నిరంజన్ కుమార్ మిశ్రా 2026 జూలై 8న సంబంధిత సర్క్యులర్‌ను విడుదల చేశారు. ఉత్తర్వుల ప్రకారం, 2025--26 ఆర్థిక సంవత్సరానికి సీఎంపీఎఫ్ సభ్యుల ప్రతి ఖాతాలో 7.6 శాతం వడ్డీ జమ చేయనున్నారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా సింగరేణి, కోల్ ఇండియా లిమిటెడ్, అలాగే దాని అనుబంధ సంస్థలైన బీసీసీఎల్, సీసీఎల్, ఈసీఎల్, డబ్ల్యూసీఎల్ తదితర బొగ్గు సంస్థల్లో పనిచేస్తున్న అన్ని సీఎంపీఎఫ్ సభ్యులకు




వర్తించనుంది. ఈ ఉత్తర్వుల ప్రతులను కేంద్ర బొగ్గు శాఖ డైరెక్టర్, కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్‌తో పాటు వివిధ బొగ్గు సంస్థల సీఎండీలకు సమాచారం, తదుపరి చర్యల కోసం పంపించారు. గత ఆర్థిక సంవత్సరంలో అమలులో ఉన్న 7.6 శాతం వడ్డీ రేటునే ఈ ఏడాదికీ కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల బొగ్గు గని కార్మికులు, ఉద్యోగుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. సీఎంపీఎఫ్ సభ్యుల భవిష్య నిధి పొదుపులపై ఈ వడ్డీ జమ కావడం ద్వారా వారికి ఆర్థిక పరంగా మరింత భరోసా కలగనుంది.

## తేజపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సూపర్వైజర్ సుమలత



**నేరడిగొండ జూలై 08 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని తేజపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతనంగా ఎంపికైన సూపర్వైజర్ సుమలత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో లబ్ధిదారులకు అందుతున్న సేవలను, రికార్డులను ఆమె నిశితంగా తనిఖీ చేశారు.గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్న పిల్లలకు ప్రతిరోజూ కోడిగుడ్లు, పాలు సకాలంలో పంపిణీ చేస్తున్నారా లేదా అని అంగన్‌వాడీ సిబ్బందిని అడిగారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఈ సందర్భంగా సూపర్వైజర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగారి వసుంధర నవీన్ పాల్గొని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఇందులో అంగన్ వాడీ టీచర్లు బీమా బాయి, జ్యోతి, ఆయా మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**ఖానాపూర్ జూలై 8(ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఫారముల డిజిటలీకరణ గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్, నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లు నింపి, తిరిగి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలికరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు డిజిటలీకరణ ప్రక్రియను నిర్ణిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన డిజిటలైజేషన్ వివరాలను బిఎల్ఓ లను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇంటికి వెళ్లి, నింపిన ఫారములను తిరిగి తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సూపర్వై జర్లు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు.స్థానికంగా నివాసం ఉన్న ఓటర్ల ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ఫారములు నింపుతున్న తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏవైనా సందేహాలు ఉంటే, హెల్ప్ డెస్క్ లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్

**కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్**
**రెండవ రోజు నిరసన కార్యక్రమం**



**ఖానాపూర్ జూలై 8 (ప్రజా జ్యోతి)** తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యం లో నిర్మల్ జిల్లా లో,ఖానాపూర్ బైంసా ప్రభుత్వా సుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఏఐటీయూసీ పిలుపుమేరకు రెండవ రోజు ధర్నా కార్యక్రమం బుధవారం నిర్వ హించారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర సెక్రటరీ కేఎస్ చారి జిల్లా కార్యదర్శి ఎస్ విలాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనాలు 26,000 అమలు చేయాలని సంవత్సరానికి 23 రోజులు సెలవు ఇవ్వాలని సంవత్సరంలో ఒక నెల జీతం బోనస్ గా ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కళాశాల ముందు గంటపాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు జులై 9న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ కోటిలో మహాధర్మా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ చారి విలాస్ లు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సత్యనారాయణ గౌడ్



**సారంగాపూర్, జులై 08,ప్రజా జ్యోతి** మండలం కేంద్రంనికి చెందిన వడ్డెర శివరాత్రి నరసింహులు ఇటీవల దుబాయిలో గుండె పోటుతో మృతి చెందారు. ఇతని భార్య లక్ష్మి ,ముగ్గురు కూతురులను, కుటుంబ సభ్యులను నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. సత్యనారాయణ గౌడ్, పరామర్శించారు అతని మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సామభూతి ప్రకటించారు. వీరి పేదరికం దృష్టిలో పెట్టుకొని.వీరికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, తెలంగాణ ఉద్యమకారులు సాదు రామ్ రెడ్డి, సామల వీరయ్య, సారంగపూర్ వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు స్వర్ణ శ్రీనివాస్, చిన్నయ్య ఉన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బలరాం జాదవ్



**నేరడిగొండ, జులై 08 (ప్రజాజ్యోతి):**మండలంలోని పలు గ్రామా ల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ప్రముఖ నాయకులు బలరాం జాధవ్ బుధవారం పరామర్శించారు

**బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం:**

మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన నాథరి సతీష్ కుమార్ ఇటీవల దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శోకసంద్రంలో ఉన్న సతీష్ కుమార్ తల్లిని బలరాం జాధవ్ కలిసి ఓదార్చారు. ఆమెకు మనోధైర్యాన్ని చెబుతూ, తక్షణ సాయంగా కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సువాలి ఇటీవల కన్నుమూయడంతో, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అక్కడి నుండి చిన్న బుగ్గారం గ్రామానికి చేరుకుని, ఇటీవల మరణించిన కమల కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.ఈ పరామర్శ కార్యక్రమా ల్లో వారి వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో వరుస ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

**ఏరియా జనరల్ మేనేజర్‌కు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వినతిపత్రం**




**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న గని ప్రమాదాల పై సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టిబిజికే ఎస్) నాయకులు డిమాండ్ చేశారు యూనియన్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ అధ్యక్షతన, బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జనరల్ సెక్రటరీ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలో ఇటీవల తరచూ జరుగుతున్న ప్రమాదాలతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రమాదాలకు గల కారణాలను సమగ్రంగా పరిశీలించి, ముందస్తు చర్యలు చేపడితే కార్మికుల ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. గనుల స్థాయిలో, ఏరియా స్థాయిలో భద్రతపై అవగాహన సదస్సులు, సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రమాదాలకు ప్రధాన కారణంగా అవసరమైన పనిముట్లు, భద్రతా పరికరాలు సకాలంలో అందుబాటులో లేకపోవడమేనని ఆరోపించారు. ముఖ్యంగా కోల్ డ్రిల్ బిట్స్, 27 ఎంఎం రూఫ్ బోల్ట్ బిట్స్, డాగ్ నెయిల్స్ (లైన్‌మెన్ కీలు), ఎస్‌డీఎల్ స్పేర్ పార్ట్స్, ఆయిల్స్, హెల్మెట్లు, భద్రతా షూస్, సాక్సులు, యూనిఫాంలు, హ్యాండ్ గ్లోవ్స్, రేన్‌కోట్లు, రూఫ్ బోల్టింగ్ సామగ్రి, కోల్ కట్టర్ విడిభాగాలు వంటి అవసరమైన సామగ్రి కొరత ఉందని తెలిపారు. అదేవిధంగా పని ప్రదేశాల్లో సరైన వెంటిలేషన్ లేకపోవడం, తాగునీటి సౌకర్యం లేకపోవడం, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు .అందువల్ల గనుల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి, కార్మికులకు అవసరమైన అన్ని రక్షణ పరికరాలు, పనిముట్లు వెంటనే అందించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు పొగాకు రమేష్ (చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ), పెట్టం లక్ష్మణ్, ఎండీ లాల్, బ్రాంచ్ సెక్రటరీలు సాదుల భాస్కర్, వెంగల కుమారస్వామి, ఉత్తేజి రెడ్డి, నాయకులు దేవేందర్, వినయ్, మాధవ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తౌటి నరేష్, పాదం శ్రీను, సల్మాన్, కార్తీక్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలికను కరీంనగర్‌లో గుర్తించిన కోటపల్లి పోలీసులు

**సురక్షితంగా తల్లికి అప్పగింపు -- పోలీసు బృందాన్ని అభినందించిన జైపూర్ ఏసీపీ**

**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోటపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ నుంచి వెళ్లిపోయిన ఓ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినిని పోలీసులు కరీంనగర్‌లో గుర్తించి సురక్షితంగా ఆమె తల్లికి అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం, కోటపల్లి కేజీబీవీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినికి హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేకపోవడంతో కొంతకాలంగా తన తోటి విద్యార్థులతో పాటు తల్లికి కూడా ఈ విషయాన్ని చెబుతూ వచ్చేది. తల్లి పలుమార్లు నచ్చజెప్పి హాస్టల్‌లోనే ఉండి చదువుకోవాలని సూచించినప్పటికీ, హాస్టల్‌లో ఉండేందుకు ఆసక్తి లేకపోవడంతో ఈ నెల 5వ తేదీ ఉదయం ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల సమన్వయంతో కూడిన దర్యాప్తు ఫలితంగా కరీంనగర్ బస్ స్టాండ్ పరిసర ప్రాంతంలో బాలికను సురక్షితంగా గుర్తించి రక్షణలోకి తీసుకున్నారు. అనంతరం అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసి ఆమెను తల్లికి అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో చురుకుగా పనిచేసిన చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, నీల్వాయి ఎస్సై జగదీష్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బుచ్చిబాబు, కానిస్టేబుళ్లు శ్యామ్ సుందర్, శ్రీనివాస్, శ్రావణ్, సమ్మయ్య, నరేష్‌లను జైపూర్ ఏసీపీ అభినందించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి






**ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**

**ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రావెల్లడి**

**ఖానాపూర్ జూలై 8 (ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ), జిల్లా పంచాయతీ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకు రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా మంజూరు చేయాలని తెలిపారు. మండలాల వారీగా గృహాల నిర్మాణ పురోగతిని ఎంపీడీవోలతో సమీక్షించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించి, ఇళ్ల నిర్మాణం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. చెత్తను శాస్త్రీయంగా నిర్వహించి సేంద్రియ ఎరువుల తయారీతో పాటు ఇతర ఆదాయ వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని, స్టీల్ బ్యాంకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులపై నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై ప్రజలు, వ్యాపారుల్లో అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి వారం రెండు రోజుల పాటు డ్రై డే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గతంలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు క్లోరినేషన్ ప్రక్రియను నిరంతరం నిర్వహించాలని సూచించారు.వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, ఇందుకు అవసరమైన స్థలాలను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే ఫామ్ పాండ్ల నిర్మాణంలో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

## 20 చోరీ కేసుల్లో నిందితుడి ప్రమేయం

## రూ.65 వేల నగదు, 900 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం

**మంచిర్యాల, 8, జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఇటీవల చోటుచేసుకున్న దేవాలయ చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, వరుసగా దేవాలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా నేరస్థుడిని అరెస్టు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన రౌతు పవన్ (26) అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.65 వేల నగదు, ఒక వివో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎండోమెంట్స్ శాఖ జూనియర్ అసిస్టెంట్ ఠాకూర్ ప్రతాప్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జూలై 5న మంచిర్యాల పట్టణంలోని శ్రీ విశ్వనాథ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయ గది తాళాలు, బీరువాను పగులగొట్టి రూ.65 వేల నగదు, 900 గ్రాముల వెండి వస్తువులు, ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు కేసు నమోదైంది. పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల డిప్యూటీ పోలీసు కమిషనర్ పర్యవేక్షణలో సహాయ పోలీసు కమిషనర్, పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు శ్రీ విశ్వనాథ ఆలయంలో చోరీ చేసినట్లు అంగీకరించడంతో పాటు, జూలై 2న మంచిర్యాల బైపాస్ రోడ్డులోని శివాలయంలో కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అంతేకాకుండా తెలంగాణలోని పలు




జిల్లాల్లో దేవాలయాలు, ఇళ్లలో జరిగిన అనేక చోరీ కేసుల్లో తన ప్రమేయం ఉన్నట్లు వెల్లడించాడు. దర్యాప్తులో నిందితుడిపై కరీంనగర్ ఒకటో పట్టణం, కరీంనగర్ రెండో పట్టణం, మంచిర్యాల, హనుమకొండ, ఇంతజార్‌గంజ్, అక్కన్నపేట, హుస్నాబాద్ పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 20 చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. వీటిలో భారతీయ శిక్షాస్మృతితో పాటు భారతీయ న్యాయ సంహిత కింద నమోదైన కేసులు కూడా ఉన్నాయి. దేవాలయ చోరీ కేసును అత్యంత వేగంగా ఛేదించి, నిందితుడిని అరెస్టు చేసి దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్న మంచిర్యాల పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రమోద్ రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, నేర పరిశోధన విభాగం సిబ్బంది ఉపేందర్, మహేష్, లక్ష్మణ్, తిరుపతిలను మంచిర్యాల సహాయ పోలీసు కమిషనర్ అభినందించారు.

## జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50% ఫీజుల్లో రాయితీ

**జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న వెల్లడి**



**ఖానాపూర్ జూలై 8( ప్రజా జ్యోతి )** జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు (విలేకరుల) పిల్లలకు ఫీజులలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు నిర్మల్ జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న ఒక ప్రకటనలో తెలుపుతూ సంబంధించిన జీవో ఉత్తర్వులను జారీ చేశారు అయితే ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు తమ పిల్లల చదువు కోసం అధిక ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు జిల్లా కలెక్టర్కు విలేకరుల సంఘాలు రాయితీ ఇవ్వాలని కోరిన మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తర్వులుజారీ చేశామని డీఈవో భోజన్నా అన్నారు ఈ సౌకర్యాన్ని విలేకరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## గుడిహత్నూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన కలెక్టర్



**గుడి హత్నూర్, జూలై 8, (ప్రజా జ్యోతి)** బుధ వారం గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు సవిత – ఉద్ధవ్ దంపతుల గృహ ప్రవేశానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్, అధికారులు, బంధువులు పూజ కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ రమేష్, సర్పంచ్ శివాజీ, లబ్ధి దారుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పా ల్గొన్నారు.

## హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా కేంద్రీకృత వంటశాలల ఏర్పాటుకు సన్నాహాలు

**రైస్ గోదాన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ప్రతిరోజూ ఉదయం పౌష్టికాహారంతో కూ డిన అల్పాహారాన్ని అందించేందుకు కేంద్రీకృత వంటశాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది.ఈ కేంద్రీకృత వంటశాల ఏర్పాటు కోసం గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రా మంలో బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఫౌండేషన్ ప్రతి నిధులతో కలిసి ఈ ప్రాంతాన్ని, రైస్ గోదాము ను స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధి కారిణి మాధవి, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, స ర్పంచ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోనాల మండల్ లో ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు



**సోనాల, జులై 08 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రం లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్ మెంట్ వంటి చారిత్రాత్మక పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని, ఆయన పాలన ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియా డారు. కార్యక్రమం లో సోనాల మండల అధ్యక్షులు గాజుల పోతన్న ,బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్,బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జంగాల బోజన్న,డీసీసీ జిల్లా కార్యదర్శి హరిసింగ్,సీనియర్ నాయకులు కసిరే పోతన్న,బాషెట్టి సుదర్శన్, శ్రీనివాస్, అమృతారావు, మహామూద్,చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**విద్యాశాఖ పై విస్తృత స్థాయి సమీక్ష**



**ఆదిలాబాద్ బ్యూరో, జులై 8 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునే విద్యార్థులకు నాణ్యమై న విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడ మే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్య త అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో విద్యాశాఖ ప్రగతి, పాఠశా లల్లో వసతుల కల్పన, పురోగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లో విద్యా ర్థుల నమోదును 30 శాతం పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయు లు, అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందు కోసం క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం సజావుగా సా గడానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిజి టల్ విద్యా విస్తరణలో భాగంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బీ ఎస్ ఎన్ ఎల్ ఇంట ర్నెట్ కనెక్షన్లు నిరంతరం పనిచేసేలా పర్య వేక్షించాలన్నారు. పా ఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనుల్లో ఎలాంటి అలస త్వాన్ని సహిం చేదిలేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగులను కలెక్టర్, అధికారులు శాలు వాలతో సత్కరించి పదవీ విరమణకు సంబంధించిన మెమెంటో పత్రాన్ని అందజేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజే శ్వర్, చిత్రు, డీఈఓ మాధవి, డీఆర్డీఓ రవీందర్, మండలాల విద్యా శాఖాధికా రులు, సెక్టోరల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్న తాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**మంచిర్యాలరూరల్ జులై08(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లాలో వరుసగా దేవాలయాలు, నివాసాల్లో చోరీలకు పాల్పడుతున్న రౌతు నగేశ్ అలియాస్ పవన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ తెలిపారు.ఈనెల 5న జరిగిన విశ్వనాథ ఆలయ చోరీ కేసును పోలీసులు ఛేదించి, నిందితుడి వద్ద నుంచి నగదు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు బైపాస్ రోడ్డులోని శివాలయంలో కూడా చోరీకి పాల్పడినట్లు,అంతేకాకుండా పలు నివాసాల్లో దొంగతనాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.పక్కా ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకుని,చోరీకి సంబం ధించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు.ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని ఏసీపీ అభినందించారు.ప్రజలు తమ ఇళ్లతో పాటు దేవాలయాల్లో కూడా భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈకార్యక్రమంలో సిఐ ప్రమోద్ రావు, పలువురు ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో ఓటరు సవరణ ప్రక్రియపై అవగాహన సదస్సులు

**ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి**

**మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు**





**మంచిర్యాల, 8, జూలై (ప్రజా జ్యోతి):** మంచిర్యాల నియోజక వర్గంలోని మంచిర్యాల మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలో ఓట రు సవరణ ప్రత్యేక కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా పలు డివిజన్లలో అవగాహన సదస్సు లు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొని, బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, ఇతర వివరాల నవీకరణ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఎల్ఓలు అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. మొదటి విడతలో 50, 49, 42, 43, 44, 13 డివిజన్లలో, రెండో విడతలో 59, 12, 55, 45, 46 డివిజన్లలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తులు త్వరగా పూర్తి చేసుకోవాలి

**ప్రజలకు చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ విజ్ఞప్తి**



**ఆసిఫాబాద్, జులై 8 (ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్వాడ, సందీప్‌నగర్ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, తహసీల్దార్ రియాజ్ అలీ క్షేత్రస్థాయిలో పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ తీరును సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడిన చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా ఎస్ఐఆర్ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకా రాలు అందించారు. ఫారాలు నింపడంలో కూడా స్వయంగా సహకరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, దూదల అశోక్, జయరాజ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## ఐటి టవర్ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో,జులై 8, (ప్రజా జ్యోతి)**ఐటీ టవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారుల ను ఆదేశించారు. బుధవారం మావల మండల కేంద్రంలో ఐ టీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ట వర్ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సంబం ధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో క లిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, త గిన సూచనలు జారీ చేశారు. జిల్లాలోని నిరుద్యోగ యువ తకు స్థానికంగా ఉద్యో గ అవకాశాలు కల్పించాలనే ప్రభు త్వ సంకల్పంలో భాగంగా ఈ ఐటీ టవర్ నిర్మాణం చేపట్టిన ట్లు పేర్కొన్నారు. నాణ్యత విష యంలో రాజీ పడకూడ దని, అత్యాధునిక హంగుల తో భవనాన్ని తీర్చిదిద్ది నిర్ణీత గడువులోగా ప్రారంభోత్సవా నికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భవనంతో పాటు అంతర్గత రహ దారులు, విద్యుద్దీకరణ, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్ స్టేషన్ ఏర్పాటు,తా గునీటి వసతి, ఇంటర్నెట్ కనె క్టివిటీ, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల పను లను త్వరిత గతిన పూర్తి చే యాలని సూచించారు.ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని, సాంకేతిక స మస్యలు లేదా ఏవైనా ఇబ్బందులు ఎదు రైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధి కారులను ఆదే శించారు.ఈ సమీక్షా సమావేశంలో ఐటీ శాఖ జోనల్ మేనేజర్ ఎం. శివ ప్రసాద్, డి.జెడ్.ఎమ్ బహు గుణ, సీ ఈ నరేందర్ రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ పురేందర్, నిర్మాణ సంస్థ ఇంజనీర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాతా, శిశు మరణాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)**జిల్లాలో మాతా, శిశు మరణాలను సున్నాకు తగ్గించే లక్ష్యం తో వైద్య ఆరోగ్య శాఖ అధికా రులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసు పత్రుల వైద్య సేవలు, మాతా, శిశు మరణాల నమోదుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణుల నమోదు నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అప్రమ త్తంగా వ్యవహరించాలని సూచించారు. అత్యవసర పరి స్థితుల్లో వైద్యసేవలు అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవే క్షించాలని, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి అవసరమైతే వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలిం చి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నా ణ్యతను మెరుగుపరచడంతో పాటు, మాతా, శిశు మరణాల ప్రతి ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి లోపాలను సరిదిద్దాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులు ప్రైవే ట్ ఆసుపత్రులకు వెళ్లకుండా వైద్య సిబ్బంది, ఆశాలు, ఏ ఎన్ ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని తెలిపారు. పుట్టిన శిశువులకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజ నాలపై ఆశ కార్యకర్తలు తల్లు లకు విస్తృతంగా అవగాహన



కల్పించాలని సూచించారు. వైద్య ఆరో గ్య శాఖలోని అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందిం చాలని, క్షేత్రస్థాయి సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్యాధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆసు పత్రుల పనితీరు, మౌలిక వస తులను పరిశీలించాలని ఆదే శించారు. సమావేశంలో పీ హె చ్ సీల వారీగా నమోదైన మాతా, శిశు మరణాల వివరాల పై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ పనితీరును మరింత మెరు గుపరచి, మాతా, శిశు మరణాలు లేని జిల్లాగా ఆదిలాబా ద్ ను తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య సేవలం దించడంలో నిర్లక్ష్యం వహించి న వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యశాఖ అధికారి డా. సాధన, రిమ్స్ డైరెక్టర్ డా. జై సింగ్ రాథోడ్, ప్రోగ్రామ్ అధికారి వై.సి. శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు, ఆశకార్యకర్తలు,ఏ ఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# తాంసిలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటా నికి పాలాభిషేకం**

**పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్**






**తాంసి, జూలై 8, (ప్రజా జ్యోతి)** రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజానాయకుడు వై ఎస్ ఆర్ అని బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆడే గజేందర్ కొనియాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా తాంసి మండల కేంద్రంలో ఘనంగా జన్మది న వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, తాంసి మండల అధ్యక్షుడు కౌడాలసంతోష్ తదితరులతో కలిసి కేక్ కట్ చేసి వై ఎస్సార్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాన్ని అంకి తం చేసిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ఆయనప్రవేశపెట్టినసంక్షేమపథకాలు, ప్రజల పట్ల ఉన్న అంకితాభా వంనేటికీ ప్రజల హృదయా ల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాల న అందించిన వైఎస్సార్ ఆశ యాలను కొనసాగిస్తూ, ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాంసి మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు, కప్పర్ల సర్పంచ్ గంద్రత్ అరుణ్, తాంసి ఉప సర్పంచ్ ల సంఘం మండల అధ్యకుడు గంగారెడ్డి, వడ్డాడి సర్పంచ్ గంగాధర్, పలోది సర్పంచ్ నాగిరెడ్డి, పొన్నారి ఉప సర్పంచ్ రామ్ రెడ్డి, కప్ప ర్ల ఉప సర్పంచ్ నర్సింలు,మా జీ ఎంపీపీ వన్నెల నరేష్, బోథ్ నియోజకవర్గ యూత్ అధ్య క్షులు బద్దం పోతారెడ్డి,జిల్లా కార్యదర్శి రామన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ధనుంజయ్, అశోక్, ఆత్మ డై రెక్టర్ గంగయ్య, మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అనుపట్ల సంజీవ్, మాజీ బోథ్ నియోజ కవర్గ అధికార ప్రతినిధి ఎం డి సద్దాం, మౌలానా, చిన్న రాం రెడ్డి, నవీన్, నరేష్,గంగాధర్, హనుమాండ్లు, రవి, జీవన్, చిలుకూరి వెంకట రెడ్డి, సురు కుంటి భోజరెడ్డి, నాందేవ్,మో హన్ తదితరులు ఉన్నారు.

# ఇంటికో మొక్క.. వర్షాలు పక్కా

**-మొక్కలతో మోక్షం**

**-దన్నూరు బి గ్రామ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి**



**బోథ్,జూలై 8 (ప్రజా జ్యోతి)** ఇంటికో మొక్క పెంచుకోవడం మూలంగా పర్యావరణ సమతుల్యత ఏర్పడి వర్షాలు సకాలంలో కురుస్తాయని దన్నూరు బి గ్రామ సర్పంచ్ రోహిణి వినయ్ రెడ్డి బుధవారం పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇల్లు ఒక మొక్క నాటి పచ్చని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన పూర్వీకులు మొక్కలను పూజించేవారని కావున ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలని, పర్యావరణ సమతుల్యత ఏర్పడడంతో సమాజం సుభిక్షంగా పాడిపంటలతో కళకళలాడుతుందని పేర్కొన్నారు. దీంతో ప్రకృతి పది కాలాలపాటు పచ్చగా ఉంటూ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరి ష్కారానికై 10న విద్యాసంస్థల బంద్ ను విజయ వంతం చేయండి

**వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ జిల్లా కమిటీ**

**ట్రస్మా, మైనార్టీ ప్రైవేట్ స్కూ ల్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షులు రంగినేని పవన్ రావు, అమీరుద్దిన్ లకు వినతిపత్రం**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)**విద్యారంగ సమస్య లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష సంఘాల పిలు పుమేరకు ఈనెల 10న నిర్వహిం చే బంద్‌లో పాల్గొని విజ యవంతం చేయాలని వామ పక్ష విద్యార్థి సంఘాల నాయ కులు కోరారు. ఈ మేరకు బు ధవారం ప్రైవేట్ పాఠశాలల సంఘాల నాయకులకు వినతి పత్రాలు సమర్పిం చారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగేడాం కేశవ్ ,పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఇషాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల ను 4 వేలకు కు దించాలనే ఆలోచనను విర మించుకోవాలని, విద్యా శాఖ కు పూర్తి స్థాయి మంత్రిని వెంటనే నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందించాల ని, మధ్యా హ్నభోజన పథకా నికి నిధులు పెంచి, అక్షయ పాత్ర, ఇస్కాన్, మన్నా వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాల ద్వారానే అమలు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యావ్యాపారాన్ని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకు రావాలని, పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, జి.ఓ. నెం. 7, 8, 9లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10 న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ ఆదిలాబాద్ జిల్లా కమిటీ రాష్ట్ర విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష సంఘాలు నిర్వహిస్తున్న బంద్ సందర్భంగా యజ మాన్యాలు, ఉపా ధ్యాయులు, స్వచ్ఛందంగా త రగతులు రద్దు చేసి మద్దతు తెలపి బంద్ విజయవంతం కోసం భాగ్య స్వామ్యం కావా లని వామ పక్ష విద్యార్థి సంఘాలు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ బడికి పంపాలి

**రాయి గూడ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు**



**సిరికొండ, జూలై 8, (ప్రజా జ్యోతి)** ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలకు తప్పనిసరిగా పంపించాలని రాయిగూడ సర్పంచ్ పెందూర్ లక్ష్మణరావు అన్నారు. ఆదివాసి గిరిజనులు చదువుతూనే ముందడుగు వేయవచ్చని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెంద వచ్చని ఆయన పేర్కొన్నారు.సిరికొండ మండలంలోని రాయిగూడ గ్రామంలో బుధవారం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు మాట్లా డుతూ ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో బడికి పంపి విద్యార్థుల భవిష్యత్తును మెరుగు పరచాలని పిలుపునిచ్చారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాది లాంటిది అని పేర్కొన్నారు. తమ గ్రామంలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని, ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పథకాల ద్వారా విద్యను అందరికీ చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శృతి, ఉపాధ్యాయులు పెందూర్ సీ తారాం, అంగన్వాడి టీచర్ యమునా, కారొబారి పంద్రం విజయ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ నూత నంగా ఎన్నికైన మండల అధ్య క్షులు కళ్లెం.నారాయణ రెడ్డి కి సన్మానం





**ఇచ్చోడ, జూలై 8, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి ప్రజాయాత్రలో భాగంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన కళ్లెం నారాయణరెడ్డిని ఘణంగా సన్మానించారు. ఈయనతో పాటు ఇచ్చోడ సర్పంచ్ గా ఎన్నికైన జలేజాకు, కొకస్ మన్నూర్ సర్పంచ్ యూసుఫ్, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, అడేగామా వార్డ్ సభ్యులు నడికుంటూ ఆశన్నలను కూడా సన్మానించారు. ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్లెం. నారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఏలేటి అశ్విని రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఎస్సి సెల్ చైర్మన్ కొత్తూరు లక్ష్మణ్,మాజీ సర్పంచ్ వసంత్, ఇచ్చోడ మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ రషీద్, ఇచ్చోడ ఎస్సీ సెల్ అధ్య క్షులు పట్ల గోవర్ధన్, బొజ్జరవి, జనరల్ సెక్రెటరీ చోలే ప్రభాక ర్, గోపుల శివకుమార్, అని ష్, నరేష్ రెడ్డి, రామ్ లక్ష్మణ్ గౌడ్, నజీర్, వాజిద్, మహ బూబ్, తదితరులు పాల్గొన్నారు.

## రణ దివ్యానగర్‌లో కమ్యూ నిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**150 మంది పోలీసు సిబ్బంది తో తెల్లవారుజామున విస్తృ త తనిఖీలు**

**తనిఖీలలో 107 ద్విచక్ర వా హనాలు, 16 ఆటోలు, ఒక కారు, నాలుగు ట్రాక్టర్లు, 10 మద్యం క్వార్టర్ బాటిల్స్ ల భ్యం**

**16 నంబర్ ప్లేట్ లేని వాహనాలు స్వాధీనం**

**గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై హెచ్చరిక జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించ డం, నేరాల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరిం త బలోపేతం చేయడం లక్ష్యంగారణ దివ్యానగర్ ప్రాంతంలో క మ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్ర మాన్ని బుధవారం తెల్లవారు జామున నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐ పీఎస్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 107 ద్విచక్ర వాహనాలు, 16 ఆటోలు, ఒక కారు, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న 16 వాహనాలను స్వాధీనం చేసుకొని, (బి ఎన్ ఎస్) సెక్షన్ 318(4) ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేస్తున్న ట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు మత సామరస్యాన్ని కాపాడాలని, సామాజిక మాధ్యమాలు లేదా బహిరంగ ప్ర దేశాల్లో గొడవలకు, విద్వేషాలకు దారితీసేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిలో జోక్యం చేసు కో కుండా వెంటనే డయల్-100 కు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రాయితీ (పిడిసి బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని చట్టాన్ని గౌరవించేలా జీవించాలని, లేకపోతే చట్టపరమైన చరచిర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలన కు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, గంజాయి సేవించడం, నిల్వఉంచడం, రవాణా చేయడం, సరఫ రాచేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కే సులు నమోదు చేసి చట్టప్ర కారం చర్యలు తీసు కుంటా మని జిల్లా ఎస్పీ హెచ్చరించా రుష్.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్ప నిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను ని వారించవచ్చని సూచించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కాంబ్లే సుభాష్ వద్ద నుంచి 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, సీఐలు బి.డి. ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎస్సైలు వి. విష్ణువర్ధన్, ఎస్. జీవన్ రెడ్డి, విష్ణు ప్రకాష్, హోరుల్తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరామర్శ



**బోథ్, జూలై 8 (ప్రజా జ్యోతి)** మండలంలోని దన్నూరు బి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు తొర్తి రాజు తండ్రి భోజన్న ఇటీవల మరణించారు. దీంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ రోహిణి రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శిరీష వార్డు సభ్యులు అసాల సదాశివ్ రవి గంగయ్య ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సోషల్ మీడియాపై పోలీసుల నిరంతర నిఘా

రెచ్చగొట్టే పోస్టులు, విద్వేష పూరిత ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**అభ్యంతరకర పోస్టులను తొ లగించకపోతే గ్రూప్ అడ్మిన్లపై కూడా కేసులు**

**ఆదిలాబాద్ పాలిటిక్స్ 2029 వరకు రాజకీయం చర్చ పొట్టు పొట్టు" వాట్సాప్ గ్రూప్‌పై ప్ర త్యేక నిఘా డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) తదితర సోషల్ మీడియా వేదికలపై జిల్లా పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, మత సామరస్యాన్ని దెబ్బతీసేలా, రాజకీయ లేదా వ్యక్తిగత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు, కామెంట్లు, ఫొటోలు, వీడియోలు, సందేశాలు ప్రచారం చేసిన వారిపై చట్టప రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసత్య ప్రచారం, అవాస్తవ వార్తలు, ఇతరులను కించపరిచే పోస్టులు లేదా ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, నేరానికి ఉపయోగించిన మొ బైల్ ఫోన్లను సీజ్ చేస్తామని తెలిపారు. ప్రత్యేకంగా "ఆది లాబాద్ పాలిటిక్స్ 2029 వ రకు రాజకీయం చర్చ పొట్టు పొట్టు" పేరుతో నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూప్‌తో పాటు ఇ లాంటి ఇతర సోషల్ మీడి యా గ్రూపుల కార్యకలాపాల పై కూడా జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. రాజకీయ చర్చల పేరు తో ఒకరినొకరు దూషించడం, వ్యక్తిగతంగా కించపరచడం, విద్వేష పూరిత వ్యాఖ్యలు చే యడం, రెచ్చగొట్టే పోస్టులు, ఫొటోలు, వీడియోలు లేదా సందేశాలను షేర్ చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థి తుల్లోనూ సహించబోమన్నా రు.వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు తమ గ్రూపుల్లో జరిగే ప్రతి పోస్టుపై బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఎస్పీ స్పష్టం చేశారు. గ్రూపుల్లో రెచ్చగొట్టే లేదా చట్టవ్యతిరేకమైన పోస్టులు వచ్చిన వెంటనే వాటిని తొలగించ కుండా నిర్లక్ష్యం చేసి నట్లయితే, పోస్టు చేసిన వ్యక్తు లతో పాటు సంబంధిత గ్రూప్ అడ్మిన్లందరిపైనా చట్టపరమై న చర్యలు తీసు కొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి కార్యకలాపాలనైనా పోలీసులు నిరంతరం పర్య వే క్షిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను బాధ్యతా యుతంగా వినియోగిస్తూ ని ర్ధారణ లేని సమాచారం, విద్వేషపూరిత పోస్టులు లేదా రెచ్చగొట్టే సందేశాలను షేర్ చేయకుండా సంయమనం పాటించాలని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆదిలాబాద్ పొలిటిక్స్ 2029 వరకు రాజకీయం చర్చ పొట్టు పొట్టు" వాట్సాప్ గ్రూప్‌పై పోలీసుల నిఘా

**రెచ్చగొట్టే పోస్టులు, అసత్యప్ర చారాలకు దూరంగా ఉండాలి**

**శాంతిభద్రతలకు విఘాతం క లిగిస్తే గ్రూప్ అడ్మిన్లు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు**

**వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)** రాజకీయ చర్చల పేరుతో సామాజిక మాధ్యమాల్లో విద్వే షాలు రెచ్చగొట్టే పోస్టులు, దు ష్ప్రచారం, అసత్య సమాచారం ప్రచారం చేయడం ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థి తుల్లోనూ సహించబోమని ఆదిలాబాద్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ హెచ్చరించారు."ఆదిలాబాద్ పొలిటిక్స్ 2029 వరకు రాజకీయం చర్చ పొట్టు పొట్టు" పేరుతో ని ర్వహిస్తున్న వాట్సాప్ గ్రూప్‌పై జిల్లా పోలీసుల నిఘా కొనసాగుతోందని తెలిపారు. ఈ గ్రూపులో సభ్యులు లేదా ఇతరులు రాజకీయాల పేరుతో ఒ కరినొకరు దూషించడం, వ్యక్తి గతంగా కించపరచడం, రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేయడం, అసత్య ప్రచారం నిర్వహించడం, ప్రజల్లో విద్వేషాలు రెచ్చ గొట్టే పోస్టులు, ఫొటోలు, వీడియోలు లేదా సందేశాలను షేర్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్ప ష్టం చేశారు. ప్రజాశాంతికి భంగం కలిగించేలా పోస్టులు చేసి న వ్యక్తులతో పాటు, అలాంటి పోస్టులను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే గ్రూప్ అడ్మిన్లు కూడా చట్టపరమైన బాధ్యత వహించా ల్సి ఉంటుందని తెలిపారు. సోషల్ మీడియా వేదికలను బాధ్య




తాయుతంగా వినియోగించాలని, అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే పోస్టులు చేయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల ప రిరక్షణకు భంగం కలిగించే ఎలాంటి కార్యకలా పాలనైనా పోలీసులు నిరంతరం పర్యవే క్షిస్తున్నా రని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునీల్ కుమార్ హెచ్చరించారు.

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

**నల్గొండ :** రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసినా సొంత ఇల్లు, కారు కూడా లేకుండా కేవలం ఒక పాత స్కూటర్‌తో సాధారణ జీవితం గడిపిన అసలు సిసలైన 'ప్రజల మనిషి', కాంగ్రెస్ సీనియర్ నేత కొమ్మిడి నర్సింహారెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత గౌరవం కల్పించింది. భువనగిరి మాజీ ఎమ్మెల్యే అయిన నర్సింహారెడ్డి నిన్న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.రాజకీయాల్లో నీతికి, నిజాయతీకి బ్రాండ్ అంబాసిడర్‌లా బతికిన నర్సింహారెడ్డి లాంటి గొప్ప నిరాడంబర నాయకుడికి ఈ రకమైన గౌరవం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తనకున్న వందలాది ఎకరాల భూమిని పేదలకు రాసిచ్చి 'భూదాన రెడ్డి'గా పేరు తెచ్చుకున్న ఆయన, చివరి రోజుల్లో అద్దె ఇంట్లో ఉంటూ కన్నుమూశారు.ఈ అరుదైన ప్రజా నాయకుడికి తుది వీడ్కోలు ఘనంగా పలికేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీలకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు జారీ చేశారు. నర్సింహారెడ్డి స్వగ్రామమైన బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని పోలీస్ బందోబస్తు, ఇతర ఏర్పాట్లను యంత్రాంగం చకచకా పూర్తి చేస్తోంది.

## వానలు లేకపోయిన గోదావరి

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతి ఏటా ఈ సమయానికి కురవాల్సిన సాధారణ వర్ష శాతం కంటే తక్కువ శాతం వర్షాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కురిశాయి. ఇదంతా ఒకవైపు. మరోవైపు గోదావరి నది నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. క్రమంగా గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. దీనికి కారణం... ఎగువన మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దంచికొడుతున్న వర్షాలే. భారీ వర్షాలతో గోదావరి ఉపనదులు పొంగిపొర్లుతూ గోదావరిలోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో వరద ప్రవాహం భారీగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల నీరు ఉరకలెత్తుతోంది. దీంతో, అలర్ట్ అయిన జలవనరుల శాఖ అధికారులు 48 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.అయితే, స్పిల్‌వే నుంచి వరద నీరు ఊహించని వేగంతో దూసుకురావడంతో.. స్పిల్ చానల్ మధ్య 902 హిల్ నుంచి

## కలెక్టర్ ఆమోదంతో అదిలా బాద్ అభివృద్ధి పనులకు మో క్షం

**మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)** ఇటీవల (జూన్ 29న) జరిగిన అదిలాబాద్ మున్సిపల్ సర్వ సభ్య సమావేశంలో కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకించిన ఎజెండా అంశాలకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలపడం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారా వుల సూచనల మేరకు ఈ ఎజెండాను కలెక్టర్ పరిశీలనకు పంపగా ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ ఆ మోదంతో పట్టణంలో రూ.50 లక్షలతో ఇంకుడు గుంతల ఏర్పాటు, రూ.90 లక్షలతో సా నిటేషన్ వాహనాల కొనుగోలు, హరితహారం కోసం రూ. 35 లక్షల నిధులు విడుదల కానున్నాయి. అలాగే 49 వా ర్డుల్లో వార్డుకు రూ.3.5 లక్షల చొప్పున చేపట్టే ,99 దేన్ ప ట్టణ ప్రణాళిక, ప్రగతికార్యక్రమ బిల్లులతో పాటు ఇతర మున్సిపల్ పనులకు మోక్షం లభించింది. ప్రజా శ్రేయస్సును కాంక్షించి అభి వృద్ధి పనుల ఆమోదానికి సహకరించిన ఇన్ చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డికి, ప్రత్యేకంగా నిధులు ఆ మోదించిన జిల్లా కలెక్టర్‌కు చై ర్‌పర్సన్ అనుషా సతీష్‌వ్యా దయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బెస్ట్ అవైలెబుల్ పథకం వి ద్యార్థులకు ఎలాంటి ఇబ్బం దులు లేవు

**సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ- ఉట్నూర్ ఉపసంచాలకులు ప్రేమకళ**

**ఆదిలాబాద్ బ్యూరో,జూలై 8, (ప్రజా జ్యోతి)** బెస్ట్ అవైలబుల్ పథకం ద్వా రా ఎంపికైన విద్యార్థులకు ఎ లాంటి ఇబ్బందులు లేవని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ- ఉట్నూర్ ఉపసంచాల కులు ప్రేమకళ ఒక ప్రకటనలో తెలి పారు. బెస్ట్ అవైలబుల్ పాఠ శాలల యాజమాన్యాలు ఎలాంటి అసౌకర్యాలకు గురిచే సినా తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని, కొందరు ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు అపోహలు సృష్టించే ప్రయ త్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి వదంతులను న మ్మవద్దని తెలిపారు. జిల్లా కేంద్రంలోని మూతపడిన పాఠశాల విద్యార్థులను మి గతా పాఠశాలలో సర్దుబాటు చేసి, ప్రతి విద్యార్థి తల్లిదండ్రు ల ద్వారా చేర్పించడం జరిగిందని తెలిపారు. కొన్ని పత్రికలలో నిజ నిర్ధారణ చేయకుండా వార్తలు ప్రచురిత మవుతున్నాయని, ఇలాంటి వదంతులను నమ్మవద్దని, ఎలాంటి అసౌకర్యాలు కలిగిన తమ కార్యాలయంలో సంప్రదించ వచ్చని తెలిపారు.

## నకిలీ బాబా అరెస్ట్ రిమాండ్

**ప్రేమ వివాహం చేసుకున్న అ మ్మాయిని తిరిగి తేస్తానని 30 వేలు తీసుకొని మోసం**

**మంత్రశక్తులతో కుటుంబాన్ని నాశనం చేస్తానంటూ బెదిరిం చి అదనంగా రూ.5 వేల వ సూలు**

**మూఢనమ్మకాలను నమ్మ వ ద్దని ప్రజలకు సూచించిన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కు మార్**




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 8 (ప్రజా జ్యోతి)** ప్రేమ వివాహం చేసుకున్న యువతిని తిరిగి తీసుకొస్తానని నమ్మబలికి, మంత్ర శక్తుల పేరుతో రూ.30 వేల రూపాయలు తీసుకుని మోసం చేసిన నకిలీ బాబాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపారు.హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన గడ్డం శివప్రసాద్‌ను ఎస్.కె. మునీర్ అనే వ్యక్తి సంప్రదించి, ప్రేమ వివాహం చేసు కున్న తన అన్నయ్య కూతురిని మంత్రశక్తులతో తిరిగి కుటుంబానికి తీసుకొస్తానని నమ్మించాడు. ఇందుకోసం తొలి విడతగా రూ.25,000 తీసు కున్నాడు. అయితే ఆరు నెల లు గడిచినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో బాధితుడు డబ్బు తిరిగి ఇవ్వాలని ప్రశ్నించగా, తనకు మరింత డబ్బు ఇవ్వాలని, లేకపోతే మంత్రశక్తులతో కుటుంబాన్ని నాశనం చేస్తానని, చంపివేస్తానని బెది రించాడు. దీంతో భయపడిన బాధితుడు మరో రూ.5,000 చెల్లించాడు. తాను మోస పో యానని గ్రహించిన గడ్డం శివ ప్రసాద్ వన్ టౌన్ పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు ఎస్.కె. మునీర్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాం డ్ విధించబడినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్‌స్పె క్టర్ బి.సునీల్ కుమార్ మాట్లాడుతూ, మంత్రాలు, తంత్రాలు, బాబాల పేరుతో ప్రజలను మోసం చేసే వ్యక్తులను నమ్మవద్దని, ఎవరైనా ఇలాంటి మోసాలకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.